వరద ముంపునకు శాశ్వత పరిష్కారం

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్
- బేగంపేట్‌లో పలు అభివృద్ధి పనులు పరిశీలన
- త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- ఇంతటి అభివృద్ధి కలలో కూడా ఊహించలేదని ఎమ్మెల్యేకు బస్తీవాసుల కృతజ్ఞతలు

బేగంపేట్ బ్రాహ్మణవాడిలో పర్యటిస్తూ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 7: ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్యకు ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం ద్వారా శాశ్వత పరిష్కారం చూపామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి బేగంపేట్‌లోని బ్రాహ్మణవాడి, వడ్డెరబస్తీ నాలా అభివృద్ధి పనులు, నూతనంగా చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. బస్తీల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లతో వాటి రూపు రేఖలు మారిపోయాయి. తమ బస్తీలు ఇంత గొప్పగా అభివృద్ధి చెందుతాయని తాము కలలో కూడా ఊహించలేదని స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణవాడిలోని లైన్ 4లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలం ప్రారంభం అవుతున్నందున్న నాలాలో మిగిలిన పూడిక తొలగింపు పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... ప్రతి ఏడాది వర్షాకాలంలో నాలాకు ఎగువ నుంచి వచ్చే వరద కారణంగా పరిసరా బస్తీల్లోకి నీరు చేరి ఇండ్లు ముంపునకు గురయ్యేవని, తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎన్నో ఏండ్లు బాధితులు కోరుతూ వచ్చారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం చేపట్టి నగరంలోని అనేక నాలాల అభివృద్ధి పనులను చేపట్టిందని వివరించారు. సుమారు రూ.45 కోట్ల వ్యయంతో బేగంపేట్ నాలా అభివృద్ధి పనులతో పాటు కాలనీల్లో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, నాణ్యత కలిగిన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి, అధికారులు బేగంపేట్ డీసీ శంకరయ్య, ఈఈ సుదర్శన్, జలమండలి డీజీఎం శశాంక్, స్థానిక నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, ఆరీఫ్, శేఖర్‌ముదిరాజ్, కిశోర్, శ్రీనివాస్‌గౌడ్ ఆకుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై బీసీల గొంతు వినిపించాలి

ఎమ్మెల్యే తలసానికి వినతి పత్రం అందజేస్తున్న దుర్గాప్రసాద్ తదితరులు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 7: ఎన్నికల సమయంలో చేసిన 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్'ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో పెట్టాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి గ్రేటర్ హైదరాబాద్ కోశాధికారి, సోషల్ మీడియా కన్వీనర్ దుర్గా ప్రసాద్ నాయాడిమాండ్ చేశారు. ఈ మేరకు గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని త్వరలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో బీసీల గొంతుకగా వినిపించాలని దుర్గాప్రసాద్ బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు రూ.1 లక్ష సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించేలా బీసీల పక్షాన ప్రస్తావించాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ నాయీ, వెంకటేశ్ నాయీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా వ్యాసరచన పోటీలు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 7: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నెల 17న వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్వీ ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు నాగేందర్ రావు కోదాటి తెలిపారు. బుధవారం నిజాం కళాశాలలో యువ నాయకుడు అవినాష్‌తో కలిసి వ్యాసరచన పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న మాజీ సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో 'అప్పుడెంట్లుం డే తెలంగాణ - ఇప్పుడెట్టుంది తెలంగాణ' అనే అంశంపై, రాష్ట్రాన్ని సాధించుకున్న అనంతరం తెలంగాణలో జరిగిన అభివృద్ధిపై పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పార్టీల అధినాయకత్వాల మెప్పు కోసమే...

తళ్లమళ్ల శ్వేత

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7: రాష్ట్ర రాజకీయాల్లో అధినాయకత్వాల మెప్పు కోసం దళిత రాజకీయ నాయకులు మాట్లాడే భాష సరికాదని ఓయూ జేఏసీ కన్వీనర్ తళ్లమళ్ల శ్వేత అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్‌పార్లమెంటరీ భాష ఉపయోగిస్తూ మాట్లాడడాన్ని ప్రజలందరూ అసహ్యించుకుంటున్నారని, యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించి, విద్యార్థి నాయకులుగా ఎదిగి, బూతులు మాట్లాడడం సరికాదన్నారు. మన రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థి సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాజకీయాల్లో నాయకులకు సహనం ఉండాలని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వారసులుగా ఆయనను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయంగా ఎదగాలని ఆమె సూచించారు.

ఆహారం అందాలంటే క్రాప్ రొటేషన్ చేయాలి

సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

అంతర్జాతీయ సదస్సులో ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7: ప్రజలందరికీ ఆహారం అందాలంటే క్రాప్ రొటేషన్ చేయాలని, అంతరించిపోతున్న జాతి మొక్కలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగం ప్రారంభించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా 'అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ సైన్సెస్ ఫర్ సస్టైయినబుల్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగం కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. వ్యాధులను తట్టుకోగలిగే వంగడాలను తయారు చేయాలని పరిశోధకులకు సూచించారు. ఇక్రిశాట్ గ్లోబల్ రీసర్చ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ సీన్ మాయెస్ 'ప్లాంట్ సైన్స్ ఫర్ సస్టైయినబుల్ ఫ్యూచర్' అనే అంశంపై కీలకోపన్యాసం వెలువరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో లేని ప్రాధాన్యమున్న పంటలను సాగులోకి తీసుకురావడం ద్వారా రైతాంగానికి మేలు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య, డీన్ ప్రొఫెసర్ కరుణసాగర్, విభాగం హెడ్ ప్రొఫెసర్ బి.రమాదేవి, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ సబితారాణి, ప్రొఫెసర్ కమలాకర్, ప్రొఫెసర్ శైలజ, డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుమన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని ప్రకటించాలి

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను విడుదల చేయాలని, అలాగే విద్యాశాఖ మంత్రిని వెంటనే ప్రకటించాలని కోరుతూ బుధవారం ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా విభాగం ఆధ్వర్యంలో ప్యారడైజ్, బేగంపేట్, క్లాక్‌టవర్ ప్రాంతాల్లో మహాధర్నాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్, విద్యార్థులు సాకేత్, చంద్రకాంత్, చందు, జోష్ణ, శివానీ, సందీప్, మహాలక్ష్మీ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- బేగంపేట్, ఫిబ్రవరి 7

ఇండ్లు సాధించేవరకు పోరాడాలి..

చిక్కడపల్లి, ఫిబ్రవరి7: డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రమాబాయి, తదితరుల మహనీయులు స్ఫూర్తితో ఇండ్లు సాధించే వరకు పోరాడాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. న్యాయం చేయాలని తొమ్మిది రోజులుగా స్వామి వివేకానందనగర్ బస్తీ వాసులు చేపట్టిన నిరసన దీక్షకు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జన్యుసంబంధ రుగ్మతలపై అవగాహన

అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో నిర్వాహకులు, అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7: ప్రతి ఒక్కరూ జన్యు సంబంధ వ్యాధుల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ 'జెనెటిక్స్ విభాగం కన్వీనర్' ప్రొఫెసర్ సురేఖా రాణి సూచించారు. రోగాలు, వాటి లక్షణాలు, చికిత్సా పద్ధతుల గురించి కనీస పరిజ్ఞానం ఉండాలని అభిప్రాయపడ్డారు. విభాగం ఆధ్వర్యంలో 'జన్యుసంబంధిత రుగ్మతలపై అవగాహన' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జన్యుపరమైన రుగ్మతలు, వాటి లక్షణాలు, రోగ నిర్ధారణ, చికిత్సలను వివరించే పోస్టర్‌లను పీజీ విద్యార్థులు ప్రదర్శించారు. అవగాహన సదస్సుల వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. వీటిపై మరిన్ని లోతైన పరిశోధనలు జరగాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ క్లినికల్ జెనిటిస్ట్ డాక్టర్ ఎం.సుజాత, కార్యక్రమ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.సంధ్య, డాక్టర్ జి.సుమలత, డాక్టర్ సోమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు తగిన గౌరవం దక్కాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7: సర్దార్ సర్వాయి పాపన్నకు తగిన గౌరవం దక్కేలా చూడాలని 'జైగౌడ్ ఉద్యమం' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ బుధవారం కేంద్ర మాజీ మంత్రి రాధాకృష్ణన్ నాడార్, రాజ్యసభ సభ్యుడు కేటీఎస్ తులసి అహ్లూవాలియాలను వేర్వేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా సర్వాయి పాపన్న గౌడ్‌కు తగిన గుర్తింపు ఉన్నప్పటికీ, జాతీయ స్థాయిలో గుర్తించడం లేదని, సర్వాయి పాపన్న చరిత్రను కేంద్రం సీబీఎస్ఈ సిలబస్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జైగౌడ్ ఉద్యమం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిశోర్‌గౌడ్, జాతీయ కోఆర్డినేటర్ రాజా నాడార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కేంద్రమంత్రి రాధాకృష్ణన్ నాడార్‌ను సన్మానిస్తున్న జైగౌడ్ ఉద్యమం నాయకులు

సుబ్బరాయశర్మకు శోభన్‌బాబు స్మారక పురస్కారం

ముషీరాబాద్, ఫిబ్రవరి 7: స్వరసుధా ఝరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సినీ నటుడు శోభన్‌బాబు జయంతిని పురస్కరించుకొని బుధవారం గానసభలో ప్రముఖ సినీ నటుడు సుబ్బరాయశర్మకు శోభన్‌బాబు స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ శేషశయనారెడ్డి పాల్గొని సుబ్బరాయ శర్మకు పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు జెన్నీ, రామకృష్ణ, పద్మారావు, లావణ్య, వరలక్ష్మీ, రాజశేఖర్‌రెడ్డి, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లా సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలలో ఎల్ఎల్బీ సెమిస్టర్ పరీక్షలను తిరిగి నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణకు ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, నాయకులు లెనిన్, బస్వరాజు, క్రాంతి, సుధాకర్, భరత్, రవి తదితరులు వినతిపత్రం అందజేశారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7

క్రీడా మైదానం ఆధునీకరణకు చర్యలు

బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 7: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయిన్‌పల్లి క్రీడా మైదానం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ తెలిపారు. బుధవారం గ్రౌండ్‌లోని వ్యాయామశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో క్రీడా మైదానాన్ని పూర్తిగా ఆధునీకరిస్తామని, ఈ విషయమై బోర్డు సీఈవో మధుకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సానూకూలంగా స్పందిన బోర్డు సీఈవో క్రీడా మైదానంలో మౌలిక వసతులతో పాటు, అభివృద్ధి పనులను చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని, ఈ మేరకు కొంత మంది దాతల సహకారంతో వ్యాయామశాలలో నూతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్, సాయిబాబా యాదవ్, కరణ్ సింగ్, జంపన్న రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామశాలలో పరికరాలను పరిశీలిస్తున్న జంపన్న ప్రతాప్

హనుమాన్ హుండీ లెక్కింపు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 7: సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయంలోని మొత్తం 20 హుండీల ద్వారా 123 రోజులకు రూ. 10,07,218ల ఆదాయం సమకూరింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవితో పాటు ఆలయ ఈవో శ్రీనివాస్‌రాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభం

బొల్లారం, ఫిబ్రవరి 7: రానున్న వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధిలోని నెహ్రూ సెంటినరీ కాలనీలో బస్తీవాసులకు నీటి ఎద్దడి సమస్య లేకుండా ముందస్తుగా పవర్ బోర్‌వెల్ పైపులైన్ కనెక్షన్లు అందిస్తున్నామని వెల్లడించారు.

ముదిరాజులను బీసీ-ఏలోకి చేర్చాలి

గోనెల కుమారస్వామి

అమీర్‌పేట్, ఫిబ్రవరి 7: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణగారిన ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చాలని 'తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సమితి' కార్యదర్శి గోరెల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చేందుకు 2009లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 15 ఇప్పటికీ ఆచరణలోకి రాకపోవడం విచారకరమన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేసిన బీసీ డిక్లరేషన్‌లో ఈ అంశం ఉందని, తక్షణమే ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. ముదిరాజుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 వేల కోట్ల నిధులను కేటాయిస్తూ, ప్రత్యేక కారర్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గృహజ్యోతిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి

జలమండలి, విద్యుత్ కార్యాలయాల్లో అధికారులతో కార్పొరేటర్ హేమ సమావేశం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 7: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ హేమ అధికారులను ఆదేశించారు. బుధవారం డివిజన్ పరిధిలోని సీతాఫలమండి విద్యుత్, వాటర్ వర్క్స్ కార్యాలయంలో ఆమె వేర్వేరుగా అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా జలమండలి సీతాఫల్‌మండి సెక్షన్ మేనేజర్ అన్వితో కార్పొరేటర్ హేమ సమావేశమై.. రానున్న ఎండాకాలంలో తాగు నీరు సరఫరాకు ఇబ్బందులూ లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, తాగు నీరు ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గరికపాటి చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్, బాలాజీ, లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'పై ఇంటింటా సర్వే..

అనంతరం సీతాఫల్‌మండిలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులతో కార్పొరేటర్ సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న ఎండాకాలం సందర్భంగా విద్యుత్ కోతలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు, అవసరమైన చోట నూతన కరెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే 'తెల్లరేషన్ కార్డు' ఉన్నవారికే గృహజ్యోతి పథకం వర్తింపు అనే వార్తల నేపథ్యంలో అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. గృహ జ్యోతి పథకానికి ఇంటింటా సర్వే కొనసాగుతుందని, ప్రజలకు ఎలాంటి అనుమానాలు ఉన్నా విద్యుత్ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ మహేశ్, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాలాజీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి జలమండలి కార్యాలయంలో అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ హేమ

అమీర్‌పేట్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు

డాక్టర్ కోటా నీలిమతో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 7: అమీర్‌పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సంగనబోయిన శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. బుధవారం అమీర్‌పేట్ కాంగ్రెస్ కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ, అధ్యక్షుడిగా నియమితులైన శ్రీనివాస్‌రావును అభినందించారు. డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేసేందుకు అందరితో కలిసి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడడంలో డివిజన్ పార్టీ శ్రేణులను అప్రమత్తులను చేయాలని ఆమె సూచించారు. తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంలో సహకరించిన డాక్టర్ కోటా నీలిమకు శ్రీనివాస్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకు సమగ్రచట్టం చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి7 : అత్యన్నత కార్మిక సంక్షేమ ప్రమాణాలతో అసంఘటిత రంగ కార్మికుల కోసం ఒక సమగ్ర చట్టం రూపొందించాలని నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ లిస్సీ జోసెఫ్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సుదరయ్య విజ్ఞానకేంద్రలో అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిస్సీ జోసెఫ్ మాట్లాడుతూ.. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేసి,కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. అసంఘటిత కార్మికుల కోసం ప్రత్యేక చట్టాలు చేయడంతోపాటు, కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రవి, శంకర్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

హరికిశోర్‌కు సత్కారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి7 : కేంద్ర సినిమా సెన్సార్ సర్టిఫికెట్ బోర్డు అడ్వైయిజరీ ప్యానెల్ మెంబర్‌గా పోతరాజు హరికిశోర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం చిక్కడపల్లిలోని భారత్ సేవా సహకార ఫోరమ్ (బీఎస్ఎస్ఎఫ్) కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివాజీ, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీఎస్ఎస్ఫ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ శర్మ, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సాంస్కృతి వికాసానికి యాదాద్రి నృత్యోత్సవాలు దోహదం

మంత్రి జూపల్లి కృష్ణారావును జ్ఞాపికతో సత్కరిస్తున్న నిర్వాహకురాలు

మంత్రి జూపల్లికృష్ణారావు

రవీంద్రభారతి, ఫిబ్రవరి7: సనాతన భారతీయ సాంస్కృతిక వికాసానికి దోహదపడే యాదాద్రి అఖిలభారత నృత్యోత్సవాలు మన సాంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళాకృతి నృత్యాలయ వ్యవస్థాపకురాలు ఎం. భారతి సంచాలకత్వాన దా డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సౌజన్యంతో రెండవ రోజు యాద్రాది నత్యోత్సవం ముగింపు కార్యక్రమం బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి శిఖరాయాన మోహినీయాట్టం నిపుణురాలు భారతీ శివాజీకి యాదాద్రి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సనాతన భారతీయ సాంస్కృతిక వికాసానికి దోహదపడే యాదాద్రి అఖిల భారత నృత్యోత్సవాలకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. నిర్వాహకుల తరపున ఫెస్టివల్ డైరెక్టర్ ఎం.భారతి.. మంత్రికి జ్ఞాపిను అందజేశారు. అనంతరం తమిళనాడుకు చెందిన మాధవపెద్ది మూర్తి బృందం కూచిపూడి, ఓడిస్సీ నాట్యం, తెలంగాణకు చెందిన డాక్టర్ పి.రమాదేవి బృందం అన్నామాచార్య కీర్తనలు వీక్షకులను మంత్రముగ్దులను చేసింది. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ జీవన్ లాల్‌లవిడియా, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, కళాకృష్ణ, డా.ఎస్పి భారతి, డాక్టర్ వనజా ఉదయ్, కె.రాంబాబు, తదితరుల చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.

ఫ్లాట్ ఫాం ఎక్కే క్రమంలో...

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 7: రైలు పట్టాలు దాటి ఫ్లాట్ ఫాం ఎక్కే సమయంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. దయానంద్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తి పట్టాలు దాటి ఫ్లాట్ ఫాం ఎక్కే క్రమంలో రైలు ఢీ కొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చూరీకి తరలించార